ముమ్మరంగా వరికోతలు

- మండలంలో 13వేల ఎకరాల్లో సాగు
- 3.25 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా



జూలపల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్

జూలపల్లి: మండలంలో వరి కోతలను రైతులు ముమ్మరం చేశారు. బావులు, బోర్లు, ఎస్సారెస్పీ డి 83, డి86 కెనాల్, హుస్సేన్‌మియా వాగు ఆధారంగా సాగు చేసిన పొలాలు ముందుగా కోతకు రావడంతో కోతలు ప్రారంభించారు. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెడుతున్నారు. నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ప్రారంభిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. మండలకేంద్రంతో పాటు 13 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 28వేల ఎకరాల్లో పంటలు సాగుచేయగా 13వేల ఎకరాల్లో వరి, పత్తి 5వేల ఎకరాల్లో సాగుచేయగా మిగతా మొక్కజొన్న, పప్పు దినుసులు, ఇతర పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. దాదాపు 3.25 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే తేమ శాతం చూసి కొనుగోలు చేయనున్నారు. వానాకాలం నుంచి పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచింది. వరికి క్వింటాల్ ఏ గ్రేడ్‌కు 2,203 కాగా సాధారణ రకానికి 2,183 ధర ప్రకటించింది.

12 కొనుగోలు కేంద్రాలు

మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జూలపల్లి పీఏసీఎస్ ద్వారా 4 కేంద్రాలు, ధూళికట్ట పీఏసీఎస్ ద్వారా 4, ఎలిగేడు పీఏసీఎస్ ద్వారా 2 కేంద్రాలు, పత్తిపాక పీఏసీఎస్ ద్వారా ఒకటి, వెలుగు మహిళా సమాఖ్య ద్వారా ఒక కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

కేంద్రాలు ప్రారంభించాలి



వరికోతలు మొదలైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి ఆరబెడతాం. బయట ఆరపోసి తీసుకువస్తే రవాణా ఖర్చులు రెండింతలు అవుతాయి.

– కుంట రాజేశ్వర్ రెడ్డి, రైతు, కుమ్మరికుంట

ధాన్యం కటింగ్ చేయొద్దు



గతేడాది కొనుగోళ్లలో తరుగు పేరుతో ధాన్యం కటింగ్ చేశారు. దీంతో రైతులు ఎంతో నష్టపోయారు. ఈ వానాకాలం కొనుగోళ్లలో తరుగు లేకుండా కొనుగోళ్లు చేయాలి. అధికారులు రైతులకు సహకరించాలి.

– కటుకం మల్లయ్య, రైతు, జూలపల్లి

ఆదేశాలు రాగానే కొనుగోళ్లు

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొంటాం. ఆదేశాలు రాగానే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటాం. అన్నదాతలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.

– నోముల వెంకట్‌రెడ్డి, చెర్మన్, పీఏసీఎస్, పత్తిపాక

క్లుప్తంగా

శివాలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని పురాతన శివాలయంలో అల్లిపూలతో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్తీక పురాణం కథను పూజారులు భక్తులకు వివరించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పూజారులు రమేశ్, మహేశ్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, పూజారులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలలో శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కోసం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్ కుటుంబ సభ్యులు రూ.21,116 విరాళం అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ కోట రంగారెడ్డి సభ్యులు పురం రమణకు అందజేశారు. కార్యక్రమంలో వేగోళం మల్లేశం గౌడ్, మధుకర్ గౌడ్, శంకర్ గౌడ్, తదితలున్నారు.

నియామకం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన అచ్చె జ్యోతికి మండల మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన నియామక పత్రాన్ని సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్ అందజేశారు. పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జ్యోతికి నియామకపత్రం అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు అల్లం కుమారస్వామి, కొలిపాక శంకర్, భగ్గని మొగిళి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



గోదావరిఖనిటౌన్: స్టార్ టైగర్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో తిలక్‌నగర్ విశ్వం కమ్యూనిటీ హాల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో అడ్డగుంటపల్లి శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన గాదె విష్ణువర్ధన్ గోల్డ్‌మెడల్, భీమారం రోహిత్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కార్మికులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సీ అండ్‌ఐ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ ఎడ్ల శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచి ఆర్థికసాయం అందించారు. సోమవారం శ్రీనివాస్ దశదిన కర్మ సందర్భంగా వారు జమచేసిన రూ.20,500 నగదును అందించారు. ఇక్కడ ఇజ్జగిరి భూమయ్య, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, కటుకూరి అంజయ్య, కంది నాగరాజు, నరోత్తమ్ రెడ్డి, మేకల సతీశ్, బాషుమియా, సతీశ్, రాజు, రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ సమీపంలోని రాజీవ్ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన మోటపల్కల శ్రీనివాస్ బైక్‌పై వస్తుండగా టీటీఎస్ గేట్ సమీపంలోని అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.



వినియోగంలోకి తెచ్చేలా..

జూలపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం మండలకేంద్రంలో నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. 25 ఏళ్ల క్రితం ఎకరం భూమిలో ఆర్టీసీ నిధులతో నిర్మించిన బస్టాండుకు ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో వినియోగించలేదు. ఇందులో 25 గుంటల్లో పల్లె ప్రకృతి వనం ఉండగా, మిగతా భూమిలో బస్టాండ్ ఉంది. ప్రస్తుతం బస్టాండ్‌కు రంగులు వేసి వినియోగంలోకి తెచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పుస్తకావిష్కరణ



మంథని: మంథనిలోని సీతారామ సేవా సదన్ వ్యవస్థాపకుడు గట్టు నారాయణ గురూజీ రామాయణం ప్రభావితం చేసే పలు అంశాలతో కూడిన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. సేవాసదన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నారాయణ గురుజీ స్ఫూర్తి దాయక రచనలను సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో సేవాసదన్ అధ్యక్షుడు హరిబాబు, సభ్యులు పల్లి ప్రహ్లాద్, గణపతి, తదితరులున్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కమాన్‌పూర్: ఈనెల 11న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో చిప్పకుర్తి సత్యనారాయణ, కొమ్ము పర్వతాలు, చిప్పకుర్తి కనకయ్య, కల్వల రాజేశం, కుక్కలింగయ్య, ఆది నారాయణ, తిరుపతి, రామస్వామి, శ్రీనివాస్, సంతోష్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రామగిరి: సెంటనరీకాలనీ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం సెంటనరీకాలనీ సీఎస్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శ్యాం సుందర్, నాగరాణి, లీలావతి, కళావతి, శ్రీనివాస్ స్వామి, ఆనంద్ రావులను మెమోంటోలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండలకేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బెజ్జంకి సాయిలు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు రూ.5వేలను ఆర్థికసాయంగా పంపించగా దూళికట్ట సింగిల్‌విండో అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాలరావు బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ మాజీ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, నాయకులు ఎదుల్ల కనుకయ్య, వడ్లూరి చంద్రమౌళి, హన్మయ్య, తేజరాజు, బుచ్చయ్య, దుర్గయ్య, నెరవట్ల రాజు, ఎదుల్ల ఆంజయ్య తదితరులున్నారు.



దుమ్ము లేస్తోంది..

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరాంపూర్ క్రాస్ రోడ్డు నుంచి గట్టేపల్లి రోడ్డు వరకు భారీ వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము, ధూళితో నిత్యం ఇబ్బంది పడుతున్నామని మున్సిపల్ కమిషనర్‌కు వ్యాపారులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇసుక ట్రాక్టర్లు, లారీలు వెళ్లడంతో సమస్య ఉత్పన్నమవుతోందని దుమ్ము లేవకుండా ఒక్కరోజే నీరు చల్లి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. నిత్యం క్యూరింగ్ చేయడంతో పాటు దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే డ్రైవర్లు, ఓనర్ల మధ్య చిచ్చు



మాట్లాడుతున్న అంజయ్య

రామగుండం: ట్రాక్టర్ యూనియన్‌లో సభ్యత్వం లేకుండా డ్రైవర్, ఓనర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ తననే అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని బూటకపు ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్ అంతర్గాం మండల ప్రతినిధి వైఖరి సరికాదని ట్రాక్టర్ యూనియన్ ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆలకుంట అంజయ్య పేర్కొన్నారు. సోమవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్ల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాడని ఆరోపించారు. గతంలోనే సదరు వ్యక్తికి యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరగా దానిని తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అధికార పార్టీ అండతో ఓనర్లు, డ్రైవర్ల మధ్యచిచ్చు పెడుతూ భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారాయన్నారు. దీనిపై యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుపుతామన్నారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు ఆలకుంట సంపత్, ఒల్లెపు స్వామి, వేముల రాజ్‌కుమార్, రమేశ్, రాజశేఖర్, సంతోష్, గుండ రవి, తాపల్లి కుమార్, దేవయ్య, ఆకాశ్, ఆలకుంట సారయ్య, తదితరులున్నారు.

అభివృద్ధిపై ప్రణాళిక విడుదల చేయాలి



మాట్లాడుతున్న మారుతి

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళిక విడుదల చేయాలని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండల మారుతి కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో మంథని అభివృద్ధికి ఏం చేస్తారో ఓటర్లకు తెలపాలన్నారు. గతంలో రామగుండం నుంచి మణుగూరు వరకు రైల్వే లైన్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదని, కాజీపేట నుంచి భూపాలపల్లి, చత్తీస్‌గఢ్ రైల్వే లైన్ సర్వే జరుగుతుందని తెలిపారు. మంథని, మహదేవపూర్‌లో పీజీ కేంద్రం గురించి ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేయాలన్నారు.

కళాశాలలో పాట చిత్రీకరణపై ఫిర్యాదు



విచారణ జరుపుతున్న అధికారులు

గోదావరిఖని: మెడికల్ కళాశాలలో ఈనెల 4న ఓ పార్టీకి సంబంధించిన పాట చిత్రీకరణపై ఎన్నికల అధికారులు విచారణ చేపట్టారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి సింగరేణి మెడికల్ కళాశాల ఆవరణలో ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డీవైఎఫ్‌ఐ నాయకులు రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణ శ్రీకి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధన కోడ్‌ను ఉల్లంఘించి ఓ పార్టీకి అనుకూలంగా ఓటు వేయాలని పాటను చిత్రీకరించారని పేర్కొన్నారు. దీనికి స్పందించిన రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ విచారణకు ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో డీవైఎఫ్‌ఐ నాయకులు కొంటు సాగర్, సురేశ్, శివకుమార్, తదితరులున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌ను వివరణ కోరగా శానిటరీ ఇన్‌చార్జి సతీశ్ అనే వ్యక్తి దీనికి అనుమతి ఇచ్చారని ఈ ఘటనపై అతనికి నోటీసు అందించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు సోమవారం విచారణ చేపట్టారు.

సిబ్బందిని తొలగించాలి

రామగుండం నియోజకవర్గ పరిధిలోని సింగరేణి మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఫేక్ ఐడీకార్డులు ధరించి ఓ రాజకీయ పార్టీకి ఓటు వేయాలని వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ తెలిపారు. కళాశాల ప్రాంగణంలోకి అనుమతించిన సిబ్బందిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

మంథని: మంథని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలకు అక్రమంగా ద్విచక్రవాహనాలపై మద్యం తరలిస్తూ బెల్ట్‌షాపుల్లో విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. మండలంలోని మైదుపల్లికి తిప్పని నరేశ్, బిట్టుపల్లికి కాసు ఓదెలుపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేత్రదానంపై అపోహలు వద్దు



దోనర్ కార్డుతో కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: నేత్రదానంపై అపోహలు వీడాలని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా గనుల వృత్తి శిక్షణ కేంద్రం(వీటీసీ)లో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నేత్ర, శరీర, అవయవ దానంపై అవగాహన కల్పించారు. చనిపోయాక పది మందికి ఉపయోగపడేలా శరీర భాగాలు దానం చేసి జీవించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా 39 మంది యువ సింగరేణి కార్మికులతోపాటు 10 మంది కాంట్రాక్ట్ కార్మికులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. వారికి డోనర్ కార్డ్ అందజేసి అభినందించారు. ఆర్జీ–2 ఎస్‌ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేశ్, సూపర్‌వైజర్ నాగెల్లి సాంబయ్య, ప్రతినిధులు మహేశ్, తిరుపతి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన అకునూరి లక్ష్మి (45) ఆదివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 20 సంవత్సరాల క్రితం లక్ష్మికి పెళ్లి కాగా భర్త వదిలి పెట్టడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. భర్త వదిలివేయడంతో మానసికంగా కృంగిపోయి, మతిస్థిమితం సరిగా లేకుండాపోయింది. ఈ క్రమంలో సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల తనిఖీ

ఓదెల: మండలంలో పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. గుంపుల, పొత్కపల్లి, కనగర్తి, ఇందుర్తి, ఓదెల, నాంసానిపల్లెలో వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల చెక్‌పోస్టు వద్ద జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపుకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు.